క్లుప్తంగా

వెండి కిరీటం విరాళం


వెండి కిరీటం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో స్వామి వారికి అదే గ్రామానికి చెందిన ఈడిగ రాజేంద్ర, గాయత్రి దంపతులు రూ.50 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని ఆలయ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ దస్తగిరి గౌడ్‌కు శుక్రవారం అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.95 వేల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ వెంకటేశ్వర్లు సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో సోదాలు నిర్వహించగా.. గడ్డివాములో అక్రమంగా నిల్వఉంచిన 15 బాక్సుల (1,440 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్) మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిల్వ ఉంచిన మద్యం పట్టణానికి చెందిన హంపయ్యకు చెందినదిగా గుర్తించామన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది నెల్లూరప్ప, నాగేష్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

పత్తికొండ రూరల్: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల చదువులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలో పర్యటించిన ఆమె గురువారం రాత్రి పత్తికొండలోనే బస చేశారు. శుక్రవారం పత్తికొండలోని గోపాల్‌ప్లాజాలో విద్యార్థులతో కలిసి 'కలలకు రెక్కలు' వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటునందించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ.నాయుడు, నాయకులు కేఈ శ్యాంబాబు, మీనాక్షినాయుడు తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీ ఎన్నిక

హాలహర్వి: మండలంలోని గూళ్యం, అమృతాపురం, సిద్ధాపురం, బల్లూరు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చంద్రశేఖర్ శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఒక కన్వీనర్, ముగ్గురు సభ్యులతో బూత్ కన్వీనర్ల కమిటీని ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ పచ్చారపల్లి రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హొళగుంద: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం అందరి బాధ్యత అని ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు అన్నారు. శుక్రవారం హొళగుంద బస్టాండులో మాషా అల్లా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. బస్టాండులో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. పెరిగిన ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, పిల్లలతో పాటు పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్నం వేళ అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లవద్దని సూచించారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో శనివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమిరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులు తెలిపారు. ఈ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 94413 12075, 96401 18716 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

12న వేలంపాట

ఆలూరు రూరల్: ఈ నెల 12న ఆలూరు పంచాయతీ పరిధిలోని మార్కెట్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు శుక్రవారం వెల్లడించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో ఉదయం 10.30 గంటలకు వేలాలు ప్రారంభమవుతాయని తెలిపారు. వారపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ పార్కింగ్, గొర్రెలు, పశువుల వధశాల తదితర వ్యాపారాలకు వేలంపాట ఉంటుందని వెల్లడించారు.







ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి,పత్తికొండలోని శివలింగం .. హాలహర్విలో పూజలందుకున్న శివలింగం, శ్రీరామ్‌నగర్ క్యాంపులోని వరలింగ స్వామి, దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి, భీమలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

సర్వం శివోహం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే పోటెత్తిన భక్తులతో బ్రహ్మాండోత్సవం నెలకొంది. ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి.హనుమంతరావ్, ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తులు, ప్రముఖులు కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి కట్టడి అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు. అర్ధరాత్రి 11.35 గంటలకు గంగా, గౌరీ మహేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యక్షంగా, పెద్ద స్క్రీన్ల ద్వారా వీక్షించిన భక్తులు పరవశించారు.

భక్తుల సేవలో దాతలు

వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, మరో ఆరుగురు దాతల సహకారంతో వెల్దుర్తి నుంచి బ్రహ్మగుండానికి ఉచిత బస్సు సర్వీసులు నడిచాయి. వెల్దుర్తి వడ్డె యూత్ ఉచితంగా మంచినీరు అందించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఏటా తమ కుటుంబీకులచే నిర్వహించే అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ, పోలీసు సిబ్బందితో వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువుదీరిన భీమ లింగేశ్వరస్వామి ఆలయంలో, జలకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తులు లింగాష్టక స్తోత్రాలను చదువుతూ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మొలగవెల్లి, కురుకుంద, కమ్మరచేడు, పెద్దహోతూరు, ముద్దనగేరి గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మఠ్రితాత మఠం నుంచి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వరకు ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు.

దేవనకొండ: మండల కేంద్రంతో పాటు కుంకనూరు, కరివేముల, పొట్లపాడు, తెర్నెకల్ గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామివార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవనకొండలో శివమాల ధరించిన భక్తులు శివలింగాన్ని గ్రామంలో ఊరేగించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని అన్ని దేవాలయాల్లో భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి పూజలు నిర్వహించారు. చుంచుఎర్రగుడి గ్రామంలో వెలసిన అతిపురాతన రామప్ప దేవాలయానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు రెండు రోజులపాటు గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. శివరాత్రి రోజు ఉపవాసంతో దేవున్ని తలిస్తే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు ఉపవాస దీక్షలు చేశారు. శనివారం చుంచుఎర్రగుడి, కంబాలపాడు, కటారుకొండ గ్రామాల్లో శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. లక్కసాగరం ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో రాత్రి నందికోల సేవ ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం శివపార్వతుల కళ్యాణం అనంతరం స్వామిని ప్రభపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించడం జరుగుతుందని, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామన్నారు.


దేవనకొండలో నందికోల సేవ నిర్వహిస్తున్న శివస్వాములు

తుగ్గలి: మండలవ్యాప్తంగా శివాలయాల్లో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉపవాసాలతో జాగరణ చేశారు. గిరిగెట్లలో రాత్రి నందికోల సేవ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బోడబండ పుణ్యక్షేత్రంలో తిమ్మగురుడు, పక్కీరప్ప స్వామి తిరునాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు సుదర్శన రెడ్డి, అప్పా వేణు, నిర్వాహకులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం తిమ్మగురుడు, పక్కీరప్పస్వామి రథోత్సవాలు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని రాజులమండగిరి శివాలయం, హోసూరులోని వీరభద్రస్వామి ఆలయంతోపాటు పత్తికొండలోని రెడ్డిబావి వీధిలోని పురాతన మహిమాన్విత శివాలయం, బైపాస్ రోడ్డులోని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాజుల మండగిరి కొండపై నిర్వాహకులు జాగారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నందవరం: గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రం ఓం నమఃశివాయ పంచాక్షరితో మార్మోగింది. శ్రీరాముడి అమృత హస్తాలతో ఉద్భవించిన స్వామి దర్శనర్థమై భక్త జనం పోటెత్తింది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా తుంగతీరం వద్ద ప్రత్యేక స్నానవాటికలు(షవర్లు) ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ దినేష్ ఆధ్వర్యంలో పురోహితులు హంపేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ధ్వజారోహణ, మహాసంప్రోక్షణ, కలశ పూజతో ఉత్సవాలకు అంకుర్పాణ పలికారు. బిల్వార్చన, రుద్రాభిషేకం, నమకచమక పూజలు గావించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి జాగరణ సందర్భంగా నటరాజ కళాక్షేత్రం బృందం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు చేపట్టారు. తెల్లవారుజామున 2 గంటలకు ఆది దంపతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ దినేష్, సీఐ మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


బ్రహ్మేశ్వరుని పూజలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులు


మద్దికెరలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న దృశ్యం

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు గంజహళ్లి, పుట్టపాశం, అలువాల, గాజులదిన్నె, వీరంపల్లి, ఎర్రబాడు, అగ్రహారం, బైలుప్పల, హెచ్ కైరవాడి, వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, తిప్పనూరు తదితర గ్రామాలలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. గోనెగండ్లలో ఈశ్వరుని దేవాలయం నందు వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి, నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో యాగమండప ప్రవేశం, గణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణం, శత రుద్రాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరిపించారు. అలాగే హెచ్ కైరవాడి గ్రామంలో సాయంత్రం శివుడి చిత్రపటంతో గ్రామస్తులు శివాలయం నుంచి ఊరేగింపు చేశారు.

ఆస్పరి: ఆస్పరిలోని మూల ఈశ్వర స్వామి, తిమ్మగురుడు పక్కీరప్ప తాత, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి, కైరుప్పల్లోని వీరభద్రస్వామి, మహాలింగప్ప ఆలయల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బిణిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు శ్రీనివాసులు నాయన ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవాన్ని ఆలయం నుంచి ఆదోని రోడ్డు వరకు నిర్వహించారు. పక్కీరప్ప తాత రథోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తిమ్మప్ప స్వామి తెలిపారు.

ఆలూరు రూరల్: స్థానిక కోట వీధిలోని భీమలింగేశ్వర ఆలయంలో అర్చకులు శివరుద్రయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జలకంఠేశ్వర ఆలయం, తుంబళబీడు గ్రామంలోని భోగలింగేశ్వర, మూసానహళ్లి గ్రామంలోని సోమలింగేశ్వర, మొలగవల్లి గ్రామంలోని నానేపాటయ్య ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 3 గంటలకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 12 గంటల లోపు శుభ ముహూర్తాన ఆదిదంపతుల కల్యాణోత్సవం నిర్వహించి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప, బసినేపల్లి తదితర గ్రామాలలో ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మద్దికెరలోని విరుపాక్షుడు దేవాలయం, కొండమ్మ బావి శివాలయం, నగిరేశ్వర దేవాలయంలో పార్వతీ పరమేశ్వర ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణ మండపంలో కొలువుంచారు. పురోహితులు వేదమంత్రాల సాక్షిగా అంగరంగ వైభవంగా స్వామి వార్ల కళ్యాణం జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రాత్రి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాద వినిమయం చేశారు.

హాలహర్వి: మండలకేంద్రంతో పాటు బిలేహాల్, గూళ్యం, విరుపాపురం, నిట్రవట్టి, చింతకుంట తదితర గ్రామాల్లో శివాలయల్లో ఉదయం నుంచి భక్తులు స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. రాత్రి జాగరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

హొళగుంద: మండలంలో దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి సన్నిదానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సిద్దేశ్వరస్వామి, సిద్దనగౌడ్ తాత, దక్షిణామూర్తి, భోగేశ్వర స్వామి, వీరభద్రేశ్వర స్వామి ఆలయాలతో పాటు పల్లెల్లో భక్తులు ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. శ్రీరామ్‌నగర్ క్యాంపులో వరలింగ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజల్లో నాల్గొని పలహారాలను నైవేద్యంగా సమర్పించారు. రాత్రంతా జాగరణ చేస్తూ భజనాలు చేపట్టారు. స్థానిక దేవమ్మ ఆలయం వద్ద రథోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పెద్దకొండలో వెలసిన మ్యాగల సిద్దప్ప ఆలయానికి కాలినడకన వెళ్లి పూజలు నిర్వహించిన భక్తులు గండ దీపాన్ని వెలిగించి గ్రామానికి చేరుకున్నారు. చుట్టు పక్కల గ్రామస్తులు దూరం నుంచే దీపాన్ని దర్శించుకున్నారు.




బ్రహ్మగుండంలో స్వామి దర్శనార్థం క్యూలోఉన్న భక్తులు, బోడబండ తిమ్మగురుడు స్వామి పూజల్లో ఆలయ నిర్వాహకులు, గురజాలలో భక్తులకు అన్నదానం

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: మండలంలోని ఆలంకొండ గ్రామ పంచాయతీలో టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆలంకొండ, పెద్దొడ్డి గ్రామాలకు చెందిన వారు పార్టీలో చేరగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. కృష్ణగిరి అంటేనే ఫ్యాక్షన్ మండలంగా పేరుండేదని, అయితే ఇప్పుడు కోనసీమలా అభివృద్ధి వైపు అడుగులు పడ్డాయన్నారు. దివంగత వైఎస్సార్ పుణ్యంతో హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ రావడంతో మండలంలో వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని, ఇప్పుడు జగనన్న పాలనలో 77 చెరువులకు నీరు మళ్లించి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన వారిలో నక్క పెద్ద కొలుట్ల, చిన్న కొలుట్ల, సోమన్న, వీరాంజినేయులు, రామాంజినేయులు, తలారి మాధవకృష్ణ, రమేష్, తదితరులు ఉన్నారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చేసిన మేలును వివరిద్దాం


హాలహర్విలో సిద్ధం పోస్టర్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు

నందవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి, హాలహర్వి గ్రామాలలో మాజీ సర్పంచ్ రామకోటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కులం, మతం, రాజకీయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, వెంటేష్, జయరాముడు, సావిత్రమ్మ, శాంతిరాజు, బజారి, ఆనంద్, ప్రతాప్, జయరాజు, తారకరాముడు, బాబయ్య, శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆలూరు: ఆలూరు నియోజకవర్గంలోని 11 రిజర్వాయర్ల నుంచి వివిధ గ్రామాలకు తాగునీటిని సక్రమంగా పంపింగ్ చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బసినె విరూపాక్షి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం చిప్పగిరి మండలంలోని ఖాజీపురం గ్రామ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రూ.15 లక్షల ఖర్చుతో హంద్రీ – నీవా సుజల స్రవంతి కాలువ నుంచి 8 ట్రాక్టర్లకు మోటార్లు బిగించి నీటిని పంపింగ్ చేసే కార్యక్రమానికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్లెల్సీ నీటిని ఖాజీపురం గ్రామ ట్యాంకులో నింపితే దాదాపు ఆరు గ్రామాలకు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు వీలుంటుందన్నారు. హాలహర్వి మండలంలోని బాపురం, చింతకుంట, విరుపాపురం, హొళగుంద గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులలోకి వంద గ్రామాలకు సరిపడే తాగునీటిని నింపేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఎంపీపీ హేమలత, మారయ్య, తదితరులు వెంట ఉన్నారు. అనంతరం చిప్పగిరి భోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


ఖాజీపురం గ్రామ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న విరూపాక్షి

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకేలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుకలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేందని, నేడు ఆ పరిస్థితి లేదని సచివాయలయంలో మన సమస్యను తెలియచేస్తే నిమిషాల వ్యవధిలోనే పరిష్కారం చూపుతారన్నారు.

అభివృద్ధి చేసి చూపుతాం

వచ్చే శాసన సభ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా పాలన సాగిస్తున్నాడని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ మనందరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, బుట్టా నీలకంఠ, ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ మహదేవమ్మ, నాయకులు సోమేష్, లక్ష్మన్న, కిష్టన్న, నరసింహులు, వివిధ పంచాయతీల సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

మహిళా దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక, మహిళలు, 3వ వార్డు కౌన్సిలర్ స్వాతి తదితరులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అలాగే స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్లు, ఎస్టీయూ, యూటీఎఫ్, డీటీఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతీయ కార్యాలయాల్లో మహిళా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

తుగ్గలి: ఆర్డీటీ ఆధ్వర్యంలో శుక్రవారం జొన్నగిరి ఎస్సీ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంస్థ కమ్యూనిటీ ఆఫీసర్ రామాంజనేయులు, సీఆర్ఎంటీ నాగేష్, వీబీకే రంగన్న మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు దూసుకెళుతున్నారన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో మహిళ పాత్ర ఎంతో కీలకమని వారికి పురుషులతో సమానంగా హక్కులు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఆసరా, అమ్మ ఒడి, చేయూత వంటి సంక్షేమ పథకాలతో మహిళలకు అండగా నిలుస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తమ పిల్లలను బాగా చదివించుకుంటామని మహిళలు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు పెద్దపీట

హాలహర్వి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలతో మహిళలకు పెద్దపీట వేశారని ఎంపీపీ నెట్టికంటమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 నగదును నాలుగేళ్లుగా అందిస్తున్నారన్నారు. ఆ డబ్బులతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని చెప్పారు. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను మాఫీ చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకే మహిళల మద్దతు ఉంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కామినహాల్ ఎంపీటీసీలు భారతి, గాదిలింగ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

హొళగుంద: శివమాల ధరించి శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లి వస్తూ మృతి చెందిన పంచాయతీ కార్యలయంలోని కాంట్రాక్ట్ సిబ్బంది మల్లికార్జున కుటుంబాన్ని శుక్రవారం పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి పరామర్శించారు. మల్లికార్జునకు భార్య శశికళ, కుమారుడు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో చెత్త తరలింపు వాహనానికి కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లికార్జున అకాల మరణానికి గురికావడంతో శుక్రవారం ఆయన భార్య శశికళకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు సెక్రటరీ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్కిల్ పరిధిలోని 294 పోలింగ్ కేంద్రాల్లో 66 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ నుంచి కేంద్ర బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ రోజు ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అలాగే ఆరు మండలాల పరిధిలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.